


RNI NO:TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక

WWW.JANAMVOICE.COM

పైన ఉన్న క్యూ.ఆర్ కోడ్ ను స్కాన్ చేసి "జనం వాయిస్" దినపత్రిక ను చదవండి.

తెలంగాణ | గురువారం | 17-09-2026 | సంపుటి: 01 | సంచిక : 244 | పేజీలు : 12


# ఓటుకు నోటు కేసు.

## రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ

- పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం.
- ఈ అంశంపై విచారణ జరిపే పరిధి ఏసీబీకి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు.
- నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన.



*జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:*
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు.

# లండన్ కు మీనాక్షి నటరాజన్.

## తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్‌గా తమిళనాడు నేత చెల్లకుమార్?

ఉన్నత విద్య కోసం లండన్ ౦ వెళుతున్న మీనాక్షి నటరాజన్.
తెలంగాణ బాధ్యతలను మరో సీనియర్ నేతకు అప్పగించే పనిలో అధిష్ఠానం.
రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన చెల్లకుమార్.



2 లో

*జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:*
దేశవ్యాప్తంగా పార్టీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణతో సహా పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లను, అలాగే ఐదారు రాష్ట్రాలకు నూతన పీసీసీ అధ్యక్షులను నియమించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య కోసం లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు వెళుతుండటంతో ఆమె స్థానంలో తమిళనాడు సీనియర్ నేత, మాజీ ఎంపీ డాక్టర్ ఎ. చెల్లకుమార్‌ను నియమించే అవకాశం ఉందనే వార్తలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. మీనాక్షి నటరాజన్ లండన్ లో ఉండే ఈ పది నెలల కాలం ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాల్సి రావడంతో, క్రియాశీలకంగా ఉన్న తెలంగాణ బాధ్యతలను మరొక సీనియర్ నేతకు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది.

### అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు

# కవిత కౌంటర్

- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్.
- తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్.
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి.
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ.
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య.



# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ.

30 రోజుల్లో నివేదిక: రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన
ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ.
నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన.
ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన.
కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి.





*జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:*
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439

### తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు:

# మంత్రి శ్రీధర్ బాబు

- రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ మధ్య పూర్తి సమన్వయం ఉందన్న శ్రీధర్ బాబు.
- రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని వ్యాఖ్య.
- అసెంబ్లీని సుదీర్ఘంగా నిర్వహించడం బీఆర్ఎస్ నేతలకు నచ్చదని విమర్శ.



# తిరుమలలో 32 ఉచిత ఈవీ బస్సుల సేవలను ప్రారంభించిన చంద్రబాబు



టీటీడీకి ఈవీ బస్సులను విరాళంగా ఇచ్చిన రిలయన్స్, బయోటెక్.
వాహన ఛార్జింగ్ స్టేషన్, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసిన రిలయన్స్.
పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యం.

# తెలంగాణలో స్కూళ్లకు దసరా సెలవులు ఎప్పట్నించి అంటే...!

తెలంగాణలో పాఠశాలలకు SA-1 పరీక్షల షెడ్యూల్ విడుదల
అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు
అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు
వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ.

2

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్.

సింగపూర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ.
తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న సింగపూర్ బృందం.
రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్న ముఖ్యమంత్రి.
సెమీకండక్టర్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ.

2

# ఓటుకు నోటు కేసు.

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.



## అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు
# కవిత కౌంటర్

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# లండన్ కు మీనాక్షి నటరాజన్.

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
దేశవ్యాప్తంగా పార్టీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణతో సహా పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లను, అలాగే ఐదారు రాష్ట్రాలకు నూతన పీసీసీ అధ్యక్షులను నియమించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య కోసం లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు వెళుతుండటంతో ఆమె స్థానంలో తమిళనాడు సీనియర్ నేత, మాజీ ఎంపీ డాక్టర్ ఎ. చెల్లకుమార్‌ను నియమించే అవకాశం ఉందనే వార్తలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. మీనాక్షి నటరాజన్ లండన్ లో ఉండే ఈ పది నెలల కాలం ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాల్సి రావడంతో,



క్రియాశీలకంగా ఉన్న తెలంగాణ బాధ్యతలను మరొక సీనియర్ నేతకు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది.

**ఎవరీ డాక్టర్ ఎ. చెల్లకుమార్?**
తమిళనాడుకు చెందిన ఈ సీనియర్ నాయకుడు 1991 (అన్నా నగర్) నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, 1996 (టి.నగర్) అసెంబ్లీ ఎన్నికల్లో తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్ వర్గం) ఎమ్మెల్యేగా గెలిచారు. 2011లో టి. నగర్ నుంచి ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కృష్ణగిరి నుంచి కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించారు. గతంలో ఏఐసీసీ కార్యదర్శిగా, గోవా రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన అనుభవం చెల్లకుమార్‌కు ఉంది. గ్రౌండ్ లెవెల్ కేడర్‌తో మమేకమయ్యే సౌమ్యుడైన నాయకుడిగా ఆయనకు మంచి పేరుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న వేళ పార్టీ-ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధించేందుకు అనుభవజ్ఞుడైన నాయకుడిని ఇన్‌చార్జ్‌గా తీసుకురావాలని అధిష్ఠానం భావిస్తోంది.

# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ.

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు:
# మంత్రి శ్రీధర్ బాబు



**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

## తిరుమలలో 32 ఉచిత ఈవీ బస్సుల సేవలను
# ప్రారంభించిన చంద్రబాబు

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
తిరుమల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను అందించేందుకు సిద్ధం చేసిన ఉచిత ఈవీ బస్సుల సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల శుభసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను తిరుమలలో ఘనంగా ప్రారంభించారు. పర్యావరణహిత రవాణా కోసం రిలయన్స్ సంస్థ 25 ఎలక్ట్రిక్ బస్సులను అందించగా, బయోటెక్ సంస్థ 7 బస్సులను టీటీడీకి ఉచితంగా అందజేసింది. బస్సులతో పాటుగా 'జియో-బీపీ' సహకారంతో ప్రత్యేక ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్, ఇతర మౌలిక సదుపాయాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గత జూన్ నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, తిరుమల కొండపై కాలుష్యాన్ని తగ్గించేందుకు టీటీడీకి రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా 25 ఈవీ బస్సులను విరాళంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బస్సులు కొండపైకి చేరుకుని నేడు భక్తుల సేవలకు అందుబాటులోకి వచ్చాయి. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు మాడ వీధులు, కాటేజీలు మరియు దర్శన క్యూలైన్ల వద్దకు ఉచితంగా చేరుకోవడానికి ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.



# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్.

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న



భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# తెలంగాణలో స్కూళ్లకు దసరా సెలవులు ఎప్పట్నించి అంటే...!

**తెలంగాణలో పాఠశాలలకు SA-1 పరీక్షల షెడ్యూల్ విడుదల**
**అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు**
**అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు**
**వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ.**

**జనం వాయిస్, డెస్క్, సెప్టెంబర్ 16:**
తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (SA-1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవులను విద్యాశాఖ వెల్లడించింది. దీని ప్రకారం, అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు SA-1 పరీక్షలు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను కేటాయించారు.

**పరీక్షల సమయాల వివరాలు ఇలా ఉన్నాయి:**
1 నుంచి 5వ తరగతి వరకు: విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు
6, 8వ తరగతులకు: ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు
7వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు
9వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు
10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి స్థాయి కూడిన టైమ్ టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.



PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్ NEWS
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

## చిందు యక్షగాన కళాకారుడు గడ్డం లక్ష్మయ్యకు పుట్ట మధూకర్ పరామర్శ.

**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 16:**
మంథని మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం లక్ష్మయ్యను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసానికి వెళ్లిన పుట్ట మధూకర్ లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ చిందు యక్షగానం వంటి తెలంగాణ జానపద కళలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. కళాకారులు తమ జీవితాలను కళకు అంకితం చేసి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. జానపద కళల పరిరక్షణకు కళాకారుల కృషి అభినందనీయమని అన్నారు. గడ్డం లక్ష్మయ్య త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పుట్ట మధూకర్ ఆకాంక్షించారు.



## ఎమ్మెల్యే గంగులను కలిసిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం

**జనం వాయిస్, కరీంనగర్, సెప్టెంబర్ 16:**
నాయి బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ నూతన కార్యవర్గ సభ్యులు, సంఘం అధ్యక్షుడు గడ్డం వెంకటేశం నాయి, ప్రధాన కార్యదర్శి సూరంపల్లి సంజీవ్‌కుమార్ నాయితో కలిసి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల నూతన కార్యవర్గ సభ్యులను శాలువా కప్పి సన్మానించి, మిఠాయిలు తినిపించారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌కు కందుల సంధ్యారాణి ఘన స్వాగతం.

- ఎన్టీపీసీ జ్యోతి భవన్‌లో వినతిపత్రాల స్వీకరణ.
- సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ.

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 16:**
తెలంగాణ రాష్ట్ర అధికారిక పర్యటనలో భాగంగా ఎన్టీపీసీ జ్యోతి భవన్‌కు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సమస్యలపై వినతిపత్రాలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ స్వీకరించారు. ఆయా సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ, సింగరేణి సంస్థలకు చెందిన అధికారులు, బీఎంఎస్ నాయకులు సాగర్ రాజు, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ముస్కూల భాస్కర్ రెడ్డి, పాలకుర్తి మండల అధ్యక్షులు మేరుగు నరేష్ గౌడ్, నాయకులు కోడూరి రమేష్, జక్కుల పద్మ, ప్రవీణ్, ఏ. రాజయ్య, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## శిలాఫలకం ధ్వంసంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు.

**కక్షపూరితంగానే శిలాఫలకాన్ని కూల్చివేశారు.**
**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: బొడ్డు రజిత రవీందర్.**

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 16:**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా ప్రజా నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై 12వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనను అవమానపరిచే ఉద్దేశంతోనే శిలాఫలకాన్ని ముందస్తు ప్రణాళికతో కూల్చివేశారని ఆమె ఆరోపించారు. శిలాఫలకానికి ఎలాంటి అడ్డంకి లేకపోయినా గోడకు అమర్చిన దానిని కావాలనే తొలగించారని పేర్కొన్నారు. శిలాఫలకం ధ్వంసానికి పాల్పడిన వారితో పాటు వారికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ ఘటనలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఏమైనా ఉందా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు బొడ్డు రజిత రవీందర్ తెలిపారు. ప్రజా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన గుర్తులను కక్షపూరితంగా తొలగించడం సరికాదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.






## సెప్టెంబర్ 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి చేయాలి.

- ప్రతి రైతు సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- సర్వే లోపంతో ఏ రైతూ సన్నధాన్యం బోనస్ కోల్పోకూడదు: కలెక్టర్ కోయ శ్రీహర్ష.

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 16:**
జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్



నమోదు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ విషయంలో డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని కలెక్టర్ తెలిపారు. సర్వే పూర్తికాకపోవడం లేదా వివరాల నమోదు లోపాల కారణంగా ఏ ఒక్క రైతూ బోనస్ కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో నేరుగా సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. మండలాల వారీగా పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో ఎంపిక చేసిన వాలంటీర్ల పనితీరును పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో పాటు మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటాలు.

- పనిభారం పెంచితే ఆందోళనలు తప్పవు.
- యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి: బూడిద గణేష్.

**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 16:**
స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్--సీఐటీయూ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మంథని డిపో వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపో కార్యదర్శి రాపెల్లి రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిపో అధ్యక్షులు పల్లెర్ల ఆంజనేయులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు బూడిద గణేష్ మాట్లాడుతూ.. 1971 సెప్టెంబర్ 16న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘాన్ని స్థాపించారని తెలిపారు. కార్మికులను ఐక్యం చేసి వారి హక్కులను సాధించడమే లక్ష్యంగా సంఘం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి అనేక సందర్భాల్లో వివిధ కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కార్మికులను చైతన్యపరుస్తూ, సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఇటీవల కాలంలో యాజమాన్యం కార్మికులపై విపరీతమైన పనిభారం పెంచుతోందని ఆరోపించారు. డ్యూటీలకు ఓటీ తగ్గించడం, రెండు రోజుల పని దినాలతో ఉన్న డ్యూటీలను ఒకరోజు డ్యూటీగా మార్చడం, ఉన్న సర్వీసులకు అదనపు కిలోమీటర్లు జోడించడం వంటి చర్యలతో కార్మికులకు నష్టం కలిగించే విధానాలను అవలంబిస్తోందని అన్నారు. కార్మికులపై పెంచుతున్న పనిభారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం పనిభారాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్,



వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వేల్పుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ధ్యేయం.. పాలకుల నిర్లక్ష్యంపై సమరభేరి.



- ఈ నెల 18న పెద్దపల్లిలో రైతు సదస్సు.
- అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.
- ముడిమడుగుల మల్లన్న, డా. దుర్గం నగేష్ పిలుపు.

**జనం వాయిస్, ఎన్టీపీసీ, సెప్టెంబరు 16:**
రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మార్వల్ దుర్గం నగేష్ విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ఈ నెల 18న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్‌రోడ్‌లో గల ఎంబీ గార్డెన్‌లో నిర్వహించనున్న రైతు సదస్సు కరపత్రాలను బుధవారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. రుణమాఫీతోపాటు గిడ్డంగులు, కల్లాల సౌకర్యాలు కల్పించాలని, రైతుల ఆత్మహత్యల నివారణకు శాశ్వత పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, మేధావులు, యువకులు, మహిళలు పార్టీలకు అతీతంగా ఏకమై సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సదస్సుకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఖాసిమ్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ తదితరులు ముఖ్య వక్తలుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం నర్సయ్య, మబ్బు నారాయణ, కాసర్ల మల్లేష్, రావుల ఉపేందర్, బూస్పాక రామచందర్, ధర్మాజీ లక్ష్మణ్, జిమ్మిడి శాంతి కుమార్, రామటంకి విశ్వనాథ ప్రతాప్, దుర్గం వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుతో రైతులకు అధిక ఆదాయం.

- సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఉద్యాన శాఖ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి.
- జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్.

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 16:**
కూరగాయల సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెద్దపల్లి మండలంలోని వివిధ కూరగాయల సాగు క్షేత్రాలను బుధవారం జిల్లా ఉద్యాన అధికారి సందర్శించారు. ఈ



సందర్భంగా రైతులు అనుసరిస్తున్న ఆధునిక సాగు పద్ధతులను పరిశీలించి, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీ పథకాలపై అవగాహన కల్పించారు. రైతు పూడారి చంద్రశేఖర్ సాగు చేస్తున్న గ్రాఫ్టెడ్ టమాటా, వంకాయ పంటలను పరిశీలించారు. ఈ పంటలు అధిక దిగుబడులు ఇస్తుండటంతో పాటు పెద్దపల్లి మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయని, తద్వారా రైతుకు మెరుగైన ఆదాయం వస్తోందని తెలిపారు. అలాగే వెదురు కర్రలను ఆధారంగా చేసుకుని సాగు చేస్తున్న కాకరకాయ పంటను పరిశీలించారు. కూరగాయల సాగులో ఆధార కర్రల ఏర్పాటుకు ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ.10 వేల వరకు, శాశ్వత పందిళ్ల నిర్మాణానికి హెక్టారుకు రూ.లక్ష వరకు రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. మల్చింగ్ షీట్లకు హెక్టారుకు రూ.20 వేల వరకు రాయితీతో పాటు టమాటా, మిరప, వంకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికమ్ తదితర కూరగాయల నాణ్యమైన నాట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పంటల అంతరకృషి పనుల కోసం మినీ ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లు తదితర వ్యవసాయ యంత్రాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నామని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ముఖ్యమని గడ్డం శ్యామ్ ప్రసాద్ అన్నారు. తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులు నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు అధిక దిగుబడులు, అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉద్యాన శాఖ అందిస్తున్న వివిధ రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పూడారి చంద్రశేఖర్, రమేష్, శ్రీనివాస్, ఉద్యాన విస్తరణ అధికారులు బి. రాము, బి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన పోలీస్ కమిషనర్

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 16:**
పెద్దపల్లి జిల్లా ఎన్‌టీపీసీ జ్యోతి భవన్‌కు విచ్చేసిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషన్ సభ్యుడి పర్యటన సందర్భంగా పోలీస్ కమిషనర్ మర్యాద పూర్వకంగా కలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## బీసీ గురుకుల ఎంజేపీ గురుకులంలో గణనాథుడికి పూజలు

**విగ్రహధాతను సన్మానించిన ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి**

**జనం వాయిస్, పఠాన్ చెరు, సెప్టెంబర్ 16:**
పఠాన్ చెరు మండలంలోని చిన్న కంజర్ల గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి, అధ్యాపకులు ఉపాధ్యాయులు, ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్రవంతి, విగ్రహదాత అయిన ఇంద్రేశం మున్సిపాలిటీ, చిన్న కంజర్ల 1వ వార్డు కౌన్సిలర్, మల్లేపల్లి శ్రీనివాస్ ను అధ్యాపకులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వారిని సన్మానించడం జరిగింది. ప్రిన్సిపల్ స్రవంతి మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని ఆశీస్సులు విద్యార్థుల పైన ఉండాలని అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ రేఖ లక్ష్మి, అనిల్ కుమార్, డిప్యూటీ వార్డెన్, రాజస్వామి, ఉపాధ్యాయులకు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# 22-ఎ పేరుతో పేదల భూములకు తాళాలు వేస్తారా?

- భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.
- భూదాన్, సీలింగ్, మిగులు భూముల వివరాలు బహిరంగపరచాలని టీడీపీ డిమాండ్.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆదేశాల మేరకు 22-ఎ నిషేధిత భూములు, భూదాన్ భూములు, సీలింగ్ భూములు, మిగులు భూముల సమస్యలపై టీడీపీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓకు బుధవారం వినతిపత్రాలు సమర్పించారు. టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచందర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. "22-ఎ పేరుతో పేదల భూములకు తాళాలు వేస్తారా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం సైతం 22-ఎ నిబంధనల కారణంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యాయని అన్నారు. దిగువ, మధ్యతరగతి కుటుంబాలు జీవితకాలం కష్టపడి సంపాదించుకున్న కొద్దిపాటి భూమే వారి భవిష్యత్తుకు ఆధారమని పేర్కొన్నారు. అలాంటి భూములు 22-ఎ జాబితాలో చేరితే అమ్ముకోవడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడం సాధ్యం కాక అత్యవసర పరిస్థితుల్లో ఆస్తిని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. పిల్లల చదువులు, వైద్యం, కుటుంబ అవసరాల కోసం ఆస్తిని ఉపయోగించుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పుగా 22-ఎ జాబితాలో నమోదైన భూములను తొలగించేందుకు సులభమైన, పారదర్శకమైన విధానం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సర్వే నంబర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని కోరారు. అదేవిధంగా జిల్లాలోని భూదాన్ భూములు, సీలింగ్ భూములు, మిగులు భూముల పూర్తి వివరాలను ప్రజలకు బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆయా భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం, ప్రస్తుత స్థితి తదితర వివరాలను పారదర్శకంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుతారపు వెంకటనారాయణ, పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు పిట్టల రాము, పట్టణ అధ్యక్షుడు బొమ్మ వెంకటేశ్వర్లు, కార్యదర్శి తల్లాడ శ్రీనివాస్, మాజీ పట్టణ కార్యదర్శి కట్ల వెంకన్న, పట్టణ యువత అధ్యక్షుడు దోంతు నరేశ్, కురవి మండల అధ్యక్షుడు పెరంవీరస్వామి, మరిపెడ మండల అధ్యక్షుడు మామిడాల వెంకన్న, బాస్కర్, శ్రీను, మరిపెడ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మాజీ పార్లమెంట్ రైతు అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు పంజాల శ్రీను, శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఏడాది బాలుడి ప్రాణం కోసం దాతల సాయం కోసం ఎదురుచూపు.

- మెదడు సంబంధిత వ్యాధితో కోమాలో చిన్నారి.
- వైద్యానికి రూ.30 లక్షలు అవసరం..
- దాతలు ఆదుకోవాలని విఎస్ఎస్ఎస్ చైర్మన్ డా. సురభి శ్రీధర్ విజ్ఞప్తి.

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 16:**
ఆడుతూ పాడుతూ ఉండాల్సిన ఏడాది వయసున్న చిన్నారి ప్రాణాలతో పోరాడుతున్నాడు. హన్మకొండకు చెందిన కోగిల శ్రీకాంత్ కుమారుడు కోగిల శ్రియాన్ మోహిత్ తీవ్ర స్థాయిలో మెదడు సంబంధిత వ్యాధికి గురై ప్రస్తుతం కోమాలో చికిత్స పొందుతున్నాడు. చిన్నారి వైద్యానికి సుమారు రూ.30 లక్షలు అవసరమవుతాయని వైద్యులు వెల్లడించడంతో, ఆ మొత్తాన్ని సమకూర్చేందుకు కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కొద్దిరోజుల క్రితం బాలుడు వైరల్ జ్వరంతో బాధపడటంతో తల్లిదండ్రులు అతడిని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా అక్యూట్ నెక్రొటైజింగ్ ఎన్సెఫాలిటిస్ ఆఫ్ చైల్డ్‌హుడ్ (ఏఎన్ఈసీ) అనే తీవ్రమైన మెదడు సంబంధిత వ్యాధితో బాలుడు బాధపడుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం చిన్నారి కోమాలో ఉండటంతో అత్యవసర వైద్యం కొనసాగుతోంది. బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న బాలుడి తండ్రి కోగిల శ్రీకాంత్‌కు కుమారుడి చికిత్సకు అవసరమైన భారీ మొత్తాన్ని సమకూర్చడం కష్టంగా మారింది. దీంతో తన కుమారుడి వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థను సంప్రదించినట్లు సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ డా. సురభి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా డా. సురభి శ్రీధర్ మాట్లాడుతూ.. ఏడాది వయసున్న చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు వైద్య చికిత్స కొనసాగాల్సి ఉందని, ఇందుకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతున్నందున దాతలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి తమకు సాధ్యమైనంత ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దాతలు అందించే ప్రతి రూపాయి చిన్నారి చికిత్సకు అండగా నిలుస్తుందని తెలిపారు.



**దాతలు ఈ ఖాతాకు సహాయం అందించవచ్చు**
ఖాతాదారు: కోగిల శ్రీకాంత్
బ్యాంక్: ఐసీఐసీఐ బ్యాంక్
ఖాతా నంబర్: 004801639462
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఐసీఐసీ0000048
యూపీఐ/ఫోన్‌పే: 9676928036

చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు దాతలు స్పందించి తమ వంతు సహాయాన్ని అందించాలని డా. సురభి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# గిరిజన తండా నుంచి డాక్టర్ లక్ష్యం వైపు..!

- ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఉగ్గంపల్లి విద్యార్థిని మిశ్రుత.
- తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తుల హర్షం.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామంలోని ధూమ్డా తండాకు చెందిన విద్యార్థిని మిశ్రుత ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఖమ్మంలోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటుకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ధూమ్డా తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆంగోత్ రమేష్, సునీత దంపతుల కుమార్తె మిశ్రుత చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని, పట్టుదలతో విద్యనభ్యసించి వైద్య విద్యలో సీటు సాధించింది. ఆమె విజయం తల్లిదండ్రులతో పాటు గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. భవిష్యత్తులో వైద్యురాలిగా ఉన్నత స్థాయికి ఎదిగి పేదలు, గిరిజన ప్రజలకు సేవ చేయాలని తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ, మండల ప్రజలు ఆకాంక్షించారు. మిశ్రుతను ఆదర్శంగా తీసుకుని గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకోవాలని పలువురు సూచించారు.



# పేదల కంటి వెలుగుగా సర్పంచ్ రమేష్ నాయక్

- ఉచిత కంటి పరీక్షల క్యాంపు.. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించి, దగ్గరుండి ఇంటికి చేర్పింపు.

**కురవి, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని ఎలుక చెట్టు తండా గ్రామపంచాయతీలో గ్రామ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సర్పంచ్ మాలోతు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు కంటి పరీక్షలు చేయించి, కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన వారిని మహబూబాబాద్‌లోని సూర్య కంటి దవాఖానాకు తీసుకెళ్లి అవసరమైన శస్త్రచికిత్సలు చేయించారు. శస్త్రచికిత్స అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షిస్తూ, బాగోగులు చూసుకున్నారు. అనంతరం చికిత్స పొందిన వారిని సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చే వరకు సర్పంచ్ రమేష్ నాయక్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం పట్ల గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "గ్రామ ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే తమ ప్రధాన బాధ్యత" అని సర్పంచ్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.



# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి.

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగవ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న పిలుపునిచ్చారు. మహాసభల ప్రచారంలో భాగంగా బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల వెంకన్న మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులపై జాతీయ మహాసభల్లో చర్చించి, భవిష్యత్ ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మంలో జరిగే జాతీయ మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మైస శ్రీనివాసులు, బాలాస్టి రమేష్, విష్ణువర్ధన్, కమలాకర్, సుధాకర్, రామచంద్రు, రవి, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, పార్టీ జిల్లా నాయకులు హలావత్ లింగన్న, పీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సామ పాపయ్య, బట్టు చైతన్య, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే కుట్రలను అడ్డుకోవాలి

- అమరుల త్యాగాలే ఎర్రజెండ చరిత్రకు ప్రాణాధారం.
- సెప్టెంబర్ 17న జనగామలో సాయిధ పోరాట వారోత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయండి.
- సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ.

**సెప్టెంబర్ 16 జన వాయిస్ పాలకుర్తి:**
వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులను అవమానపరిచే మతోన్మాద వక్రీకరణ శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మండల కార్యదర్శి మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. బుధవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో వీరనారి ఐలమ్మ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల బహిరంగ సభ కరపత్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల వారసత్వాన్ని సిపిఎం పార్టీ ప్రజా ఉద్యమాల ద్వారా కొనసాగిస్తుందని అన్నారు. నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి రజాకార్లను ఎదుర్కొని దోపిడి దారుల బానిసత్వాన్ని చెరిపేసిన వీరులు తెలంగాణకు గర్వకారణం అని గుర్తు చేశారు. సాయిధ పోరాటంలో 4000 మంది అమరులై 10 లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర ఎర్రజెండదేనని వారు తెలిపారు, నేటికీ దేశంలో పేదరికం తిండి గూడు లేని ప్రజలు అనేకంగా ఉన్నారని పేదల రాజ్యం రావాలంటే ఎర్రజెండా అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని కష్టజీవుల రాజ్యమే ఎర్రజెండా రాజ్యమని సిపిఎం పోరాటంలో ప్రజలు ఐక్యంగా ముందుండాలని పిలుపునిచ్చారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం గారు, హాజరవుతున్నట్లు తెలిపారు, బహిరంగ సభకు సిపిఎం శ్రేణులు ప్రజలు వ్యవసాయ కూలీలు రైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, ముస్కు ఇంద్రారెడ్డి, నాయకులు మల్లురాజు నరేష్, కే బాబు, తోటరాజు, కే పద్మ, యాకలక్ష్మి, మైసమ్మ, సోమలక్ష్మి, గౌతమి, ఇద్దామా, సోమక్క, లచ్చుమ్మ, బుచ్చమ్మ, మాధవి, చంద్రమ్మ, బాలమ్మ, స్వరూప, చిన్న సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



# పోస్ట్ మార్టం సౌకర్యం కల్పించాలని జిల్లా వైద్యా అధికారులకు సీపీఐ ఎం ఎల్ వినతి.

- నిధులు లేవు మమ్మల్ని ఎం చేయమంటారు.హాస్పిటల్ అధికారులు.
- ఎమ్మెల్యే జర పెద రోగులను పట్టించుకోండి.




**సెప్టెంబర్ 16 జనం వాయిస్ పాలకుర్తి:**
అనేక ఏళ్లుగా మంజూరి అయ్యి ప్రజల సేవలో లో లేని పోస్ట్ మార్టమ్ సౌకర్యం కల్పించాలని ఆసుపత్రి లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కారం చేయాలనీ సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యధికారులను కలిసి వినతి పత్రం ద్వారా వివరించారు.ఈ సందర్బంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పోస్టు మార్టం గది,దానికి అవసరమైన ఎక్విప్మెంట్స్ మంజూరి అయ్యి ఉన్నప్పటికీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం మూలంగా ప్రజలకు అందుబాటులో లేకుండపోయిందని ఆయన అన్నారు. ఎక్విప్మెంట్స్ కూడా తుప్పుపట్టి పోయే ప్రమాదం వున్నదని తక్షణమే పోస్ట్ మార్టమ్ సౌకర్యం ఏర్పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న హాస్పిటల్ పనుల వలన ఓపి రోగులను గంటల తరబడి ఎండలో నిలబెట్టి ఓపి చిట్టీలు ఇవ్వడం సరికాదని వారు జిల్లా వైద్యాధికారులైన డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వాణి శ్రీ. డిసి హెచ్ ఎస్ డాక్టర్ సంధ్య మరియు మెడికల్ సూపరింటే డెంట్ డాక్టర్ శ్రీనివాస్ లకు రాత పూర్వకంగా వివరించారు. రోగులకు అందిస్తున్న రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్ట్ లు సకాలంలో అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. అయితే మొత్తం జిల్లా వ్యాపితంగా రిపోర్ట్ లు ఇవ్వడం లో కొంత జాప్యం జరుగుతున్నాదని దాని లోపాలు త్వరలో సరి చేస్తామని సూచించారు జిల్లా వైద్యాధికారులు. పిహెచ్ సి. సిహెచ్ సి హాస్పిటల్ ను వేరు వేరు చేయాలనీ కోరగా కొత్త బిల్డింగ్ తధనంతరం విభజిస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఓపి చిట్టీలు అందుంచలేకపోతున్నామని ప్రయివేట్ అప్పులు చేసి మరి ఓపి చిట్టి లు ప్రింటింగ్ చేయిస్తున్నామని వారు అన్నారు. రోగులకు అవసరమైన నిధులు ఇవ్వలేని విషయం లో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఆ పార్టీ మండల కార్యదర్శి కొనుకటి కళింగరాజు. కోతి సుధాకర్.గాయల బాబు. మంకాళి కార్తీక్. పెద్ది రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నేరడ విద్యార్థులు

**కురవి, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు నేరడ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 20 వరకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మినీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బి. వరలక్ష్మి, బి. అమృత, బి. సాహితి, బి. చందన, బి. కరుణ పాల్గొననున్నారు. ఈ నెల 4న మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వీరు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వాంకుడోత్ బాలాజీ, పీడీ సమ్మెట ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థినులను అభినందిస్తూ, క్రీడలతో ఆరోగ్యంతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లోనూ మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్. మంజీ, టి. మాధవాచారి, జి. కిష్టు, ఎస్. శంకర్, ఎం.డి. అజ్మత్‌నిసాబేగం, రవికుమార్ తదితరులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు.



# మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఉప సర్పంచ్ గాదేపాక కిరణ్

**సెప్టెంబర్ 16 జనం వాయిస్ పాలకుర్తి:**
పాలకుర్తి మండల కేంద్రంలో ప్రతి వారం జరిగే సంతలో అమ్మకం, మరియు కొనుగోలు దారుల, ప్రజల సౌకర్యార్థం స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా 3లక్షల రూపాయలతో మంజూరైన, మరుగుదొడ్ల నిర్మానానికి, స్థానిక ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్ బుధవారం ముఖ్య అతిధిగా పాల్గొని, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల ఆత్మ అభిమానమే ముఖ్యమని, ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో, జిపి కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు కత్తుల నరేష్, సలేంద్ర, రమా సోమన్న, వీరమనేని హనుమంతరావు, కత్తి దస్తగిరి, కమ్మగాని సుధాకర్, నెమరుగమ్ముల శ్రీనివాసరావు, కామారపు సునీల్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కుంగ్‌ఫు ఛాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 16:**
సోమగూడెంలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్‌లో సెప్టెంబర్ 20న జరగనున్న కుంగ్‌ఫు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల ట్రోఫీని మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా కుంగ్‌ఫు సంఘం సభ్యులు కుందెల్ల రవి, ప్రసాద్, ఒలింపిక్ కోశాధికారి కనపర్తి రమేష్ జీఎంను కలిసి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. 20--25 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు ఉపయోగకరమని, బాలబాలికలను ఈ విద్య అభ్యసించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జీఎం సూచించారు.



# 12 పశువులతో వాహనం పట్టివేత

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 16:**
మందమర్రి టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో 8 ఆవులు, 4 దూడలు కలిపి 12 పశువులను స్వాధీనం చేసుకున్నారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో ఎస్ఐ లచ్చన్న సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఆసిఫాబాద్ నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లె మార్కెట్‌కు తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా డ్రైవర్ పరారయ్యాడు. పశువులు, వాహనాన్ని మందమర్రి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించొద్దు.

## ప్రజలపై డిజిటల్ చెల్లింపుల భారం మోపొద్దు: జూపాక శ్రీనివాస్.

**కరీంనగర్, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో ఎలాంటి ఛార్జీలు విధించకుండా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు నిత్యావసరాల కొనుగోళ్లు, ఇతర చెల్లింపుల కోసం యూపీఐ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. చిన్న వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు యూపీఐ సులభమైన డిజిటల్ చెల్లింపు విధానంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై ఏవైనా ఛార్జీలు విధిస్తే సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాన్ని మోపే విధానాలను అనుసరించకూడదన్నారు. సాధారణ యూపీఐ లావాదేవీలు ప్రస్తుతం వినియోగదారులు, వ్యాపారులకు ఉచితంగా ఉన్నాయని ఎన్‌పీసీఐ పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఉచిత సేవలను కొనసాగించాలని, భవిష్యత్తులోనూ సాధారణ యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించబోమని కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. యూపీఐ వినియోగించే సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపకూడదని, చిన్న వ్యాపారులపై లావాదేవీ ఖర్చులను బలవంతంగా మోపరాదని డిమాండ్ చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూపీఐ ఛార్జీలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్లు జూపాక శ్రీనివాస్ తెలిపారు.



# ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదు..?

- దళిత బాలికలంటే ఎందుకింత నిర్లక్ష్యం?
- ప్రైవేట్ భవనంలో బాలికల భద్రతపై శ్రద్ధ లేదా?
- ప్రజావాణి, ఎమ్మెల్యేకు ఫిర్యాదులు. అయినా స్పందన ఏది?.
- మంత్రి స్థాయి, జిల్లా స్థాయిలోని కొందరు అధికారులపై ఒత్తిడి ఉందా?.
- మౌలిక వసతుల్లేని భవనంలో విద్యార్థినుల అవస్థలు.
- సురక్షిత భవనానికి తరలింపు ఆదేశాలు కాగితాలకే పరిమితమా?.
- "ఇదేనా ప్రజాపాలన?" స్పందించకపోతే ఉద్యమం తప్పదు.
- పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్.

**కురవి, సెప్టెంబర్ 16 (జనం వాయిస్):**
దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థినులు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దళిత నాయకులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రైవేట్ భవనంలో బాలికల భద్రతపై శ్రద్ధ లేదా?
మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో లేని ప్రైవేట్ భవనంలో విద్యార్థినులు ఎలా నివాసం ఉండాలి? బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్న మరో భవనంలోకి వసతి గృహాన్ని మార్చాలని కోరుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని దళిత నాయకులు ప్రశ్నిస్తున్నారు.

### ఆదేశాలు కాగితాలకే పరిమితమా?


epaper.janamvoice.com | Date: 16 Sep, 2026 | Page: 3

**ఎస్సీ వసతి గృహాన్ని సురక్షిత భవనానికి తరలించాలి**

- ఎంఆర్పిఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య.

**కురవి, సెప్టెంబర్ 15 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం పాత పెంకుటింట్లో కొనసాగుతుండటంపై దళిత నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో విద్యార్థినుల భద్రత, ఆరోగ్యంపై అధికారులు తక్షణమే స్పందించి సురక్షిత భవనానికి తరలించాలని ఎంఆర్పిఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీరు, విద్యుత్, పడకలు, పరిశుభ్రత, భద్రత తదితర మౌలిక వసతులను అధికారులు ప్రత్యేకంగా తనిఖీ చేయాలని కోరారు. భవనానికి తక్షణమే సాంకేతిక తనిఖీ నిర్వహించి, ప్రమాదకరంగా ఉన్నట్లు తేలితే విద్యార్థినులను అన్ని సౌకర్యాలు కలిగిన సురక్షిత ప్రత్యామ్నాయ భవనానికి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన సొంత ఎస్సీ బాలికల వసతి గృహ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులను నిర్దిష్ట కాలపరిమితిలో ప్రారంభించాలని కోరారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న దైద భద్రయ్య, కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మాజీ వార్డు సభ్యుడు ఇరుగు వెంకన్న, సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత కిన్నెర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన భవనంలోకి వసతి గృహాన్ని తరలించాలన్న సూచనలు, వినతులు ఉన్నప్పటికీ అమలు ఎందుకు జరగడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు సమస్యను పరిశీలించారా? పరిశీలించి ఉంటే ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

### ప్రజావాణిలో ఫిర్యాదులు.. అయినా స్పందన ఏది?
వసతి గృహ సమస్యపై దళిత రత్న, వార్డు సభ్యులు, దళిత నాయకులు ఇప్పటికే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ ప్రజావాణి, సంబంధిత శాఖ జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. అలాగే కురవి ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే పలుమార్లు ఫిర్యాదులు, వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### "ఇదేనా ప్రజాపాలన?"
ప్రైవేట్ కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతే ఆ హామీల అమలు ఎక్కడ? దళిత బాలికలకు మౌలిక వసతులు కల్పించడం కూడా ఇంత కష్టమా? అని వారు ప్రశ్నిస్తున్నారు. "దళిత బాలికలైతే సౌకర్యాలు లేని భవనంలోనే ఉండాలా? ఇదేనా ప్రజాపాలన?" అని దళిత నాయకులు నిలదీస్తున్నారు.

### నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలి
కురవి మండల కేంద్రంలో ఎస్సీ బాలికల కోసం శాశ్వత వసతి గృహ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు అన్ని మౌలిక వసతులు, భద్రత ఉన్న భవనంలోకి ప్రస్తుత వసతి గృహాన్ని తరలించాలని కోరుతున్నారు.

### ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదు?
స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం ఎందుకు కాలేదని దళిత నాయకులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు సమస్యపై తక్షణ విచారణ జరిపి, విద్యార్థినుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### అధికారులపై ఎవరి ఒత్తిడి?
వసతి గృహం మార్పు విషయంలో మంత్రి స్థాయి, జిల్లా స్థాయిలోని కొందరు అధికారుల జోక్యం లేదా అడ్డంకులు ఉన్నాయంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారికంగా ఎలాంటి ధృవీకరణ లేదు. నిజంగా ఏదైనా ఒత్తిడి లేదా అడ్డంకి ఉంటే దానిపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### "ఇదేనా ప్రజాపాలన?" స్పందించకపోతే ఉద్యమం తప్పదు
ఇప్పటికైనా జిల్లా అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహాన్ని సురక్షితమైన, మౌలిక వసతులు కలిగిన భవనంలోకి తరలించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే విద్యార్థి సంఘాలు, దళిత సంఘాలను ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

### స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ స్పందించాలి : పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్
కురవిలో దళిత బాలికల వసతి గృహాన్ని సురక్షితమైన భవనంలోకి తరలించాలని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్ని అన్ని మౌలిక వసతులు ఉన్న భవనంలోకి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ బాలికల కోసం నూతన హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని, అప్పటివరకు అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలో హాస్టల్ నిర్వహించాలని సూచించారు. స్పందించి విద్యార్థినుల సమస్యలను పరిష్కరించకుంటే అందోళన చేపడతామని దేవేందర్ హెచ్చరించారు.



# సమ్మె లేకుండానే 24 డిమాండ్లు సాధించాం.

- చారిత్రాత్మక ఒప్పందంపై విమర్శలు సరికాదు.
- పోరాటాలతో రెండు బ్లాకులు సాధించుకున్నాం.
- గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లు ఉండాల్సిందే.
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య.








**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 16:**
సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఒక్కరోజు కూడా సమ్మె చేయకుండా సమ్మె నోటీసు ద్వారా 24 డిమాండ్లను ఒప్పందం ద్వారా సాధించుకోవడం కార్మికుల విజయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 డిసెంబర్ 27న ఏడోసారి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ విజయం సాధించినప్పటి నుంచి స్ట్రక్చర్ కమిటీలలో కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జూన్ 8న 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. దీంతో యాజమాన్యం చర్చలకు ముందుకు వచ్చి ఆగస్టు 27న హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్మిక కమిషనర్ సమక్షంలో 24 డిమాండ్లపై కార్మికులకు అనుకూలంగా ఒప్పందం కుదుర్చుకుందని పేర్కొన్నారు. ఒప్పందంలో భాగంగా పెర్క్స్‌పై విధించే ఆదాయపు పన్నును కోల్ ఇండియా తరహాలో కంపెనీయే చెల్లించేందుకు అంగీకరించిందన్నారు. మారు పేర్ల డిపెండెంట్లకు కమిటీ నివేదిక ఆధారంగా ఉద్యోగాలు కల్పించేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రూ.20 లక్షలకు పెంచినట్లు చెప్పారు. సొంత ఇంటి పథకాన్ని కోల్ ఇండియా, ఎన్‌టీపీసీ తరహాలో అమలు చేసే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులకు లాభాల్లో 40 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేయగా, దసరా పండుగకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రకటన చేయించి లాభాల వాటా చెల్లించేందుకు అంగీకరించారని సీతారామయ్య తెలిపారు. 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పెండింగ్ డిపెండెంట్ల సమస్యల పరిష్కారానికి కూడా అంగీకారం లభించిందన్నారు. మైనింగ్ సిబ్బంది, ఈఅండ్ఎం సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్‌లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో వారికి అనువైన ఉద్యోగాలు కల్పించేందుకు అంగీకరించారని తెలిపారు. మైనింగ్ స్టాఫ్, సర్వేయర్లు, క్లరికల్ సిబ్బంది, అంతర్గత అభ్యర్థుల ప్రమోషన్లు, పరీక్షలను త్వరలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, రిటైర్డ్ కార్మికులకు ఉచిత ఇన్‌పేషెంట్ వైద్యం, ఏడాది సర్వీస్ పూర్తయిన వారికి ఖాళీల ఆధారంగా బదిలీలు వంటి అంశాలపై కూడా ఒప్పందం కుదిరిందన్నారు.

### విమర్శలు సరికాదు
సమ్మె లేకుండా చారిత్రాత్మక ఒప్పందం సాధించడాన్ని జీర్ణించుకోలేక టీబీజీకేఎస్‌తో పాటు మరికొన్ని కార్మిక సంఘాలు ఏఐటీయూసీపై విషప్రచారం చేస్తూ ఆరోపణలు చేస్తున్నాయని సీతారామయ్య విమర్శించారు. 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించేలా ఒప్పందం సాధించడం చారిత్రాత్మక పరిణామమన్నారు. ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించే విధానంతో పాటు అనేక కార్మిక సమస్యలకు పరిష్కారం లభించిందని తెలిపారు.

### గుర్తింపు కాలపరిమితి నాలుగేళ్లు ఉండాలి
2012 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేకపోయాయని సీతారామయ్య విమర్శించారు. కొత్త మైన్‌ను కూడా తీసుకురాలేదన్నారు. 2023లో కార్మిక సంఘం ఎన్నికల పోటీ నుంచి తప్పుకుని రాజీనామా చేసిన వారే ఇప్పుడు తిరిగి ఎన్నికలు నిర్వహించాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏఐటీయూసీ గెలిస్తే రెండేళ్లు, ఇతర సంఘాలు గెలిస్తే నాలుగు నుంచి ఆరేళ్ల వరకు గుర్తింపు కాలపరిమితి ఉండాలా అని ప్రశ్నించారు. గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ఖచ్చితంగా నాలుగేళ్లు ఉండాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాడి సాధించుకున్న రెండు బ్లాకులు కూడా తమ పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి మాట్లాడారు. బ్రాంచి నాయకులు మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్‌బాబు, ఎస్. వెంకట్‌రెడ్డి, గండి ప్రసాద్, సిద్ధమల్ల రాజు, పి. విజయలక్ష్మి, సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ-1 అధ్యక్షుడు ఎం.ఎ. గౌస్‌తో పాటు కార్మికులు, బ్రాంచి ఆఫీస్ బేరర్లు, పిట్ కార్యదర్శులు, మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో గణేష్ మండపాలను సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**జనం వాయిస్, కరీంనగర్, సెప్టెంబర్ 16:**
కరీంనగర్ నియోజకవర్గంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టవర్ సర్కిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రకాశం గంజ్ వర్తక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శాస్త్రి రోడ్ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కోతి రాంపూర్‌లో పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో, హనుమాన్



నగర్‌లో కొండ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ స్టేడియం వద్ద తిరుమల నగర్‌లో దాసరాపు అనురాగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో, రాంనగర్‌లో బంటి గౌడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావానికి నిదర్శనమని మంత్రి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటూనే భద్రతా నిబంధనలను పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రజలందరూ పరస్పరం సహకరించుకుంటూ గణేష్ ఉత్సవాలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని మంత్రి కోరారు.